# అడల్ట్స్ ఓన్లీ కథ




# కొల్లగొట్టిత నీలాంబరం..

''ట్రైన్ నెంబర్ 7008 హైదరాబాద్ నుండి విశాఖపట్నం వెళ్లవలసిన గోదావరి ఎక్స్‌ప్రెస్ ఒకటవ నెంబరు ప్లాట్‌ఫామ్‌పై ఆగి వున్నది'' ట్రైన్ వచ్చిన హడావుడిలో అనౌన్స్‌మెంట్ సరిగ్గా వినిపించటంలేదు.

''అప్పర్ బెర్త్ నువ్వు ఎక్కలేవు. నేనెక్కుతా, నువ్వు లోయర్ బెర్త్ మీద పడుకో''

''చాల్లెండి వేళాకోళం. మీది అప్పర్ బెర్త్‌లు ఎక్కే వయసా? ఈ రైల్వే వాళ్లకి బుద్ధి లేదు. సీనియర్ సిటిజన్స్‌కి లోయర్ బెర్త్ ఇవ్వాలి. ఇదిగో ఇలాంటి యంగ్ స్టార్స్‌కి అప్పర్ బెర్తులివ్వాలి. ఈసారి మనూరు లల్లూగారు వచ్చినప్పుడు ఈ విషయం తేల్చేస్తాను. నువ్వు కాస్త జరుగమ్మాయ్'' అంటూ ప్రక్కనున్న అమ్మాయిని జరిపి మరీ కూర్చుంది వర్ధనమ్మ.

''ఆయనకి సుగర్, నాకు మధుమేహం. ఇద్దరం మీదకెక్కలేం. నువ్వు కాస్త అప్పర్ బెర్తు తీసుకో అమ్మాయి. మేం అనకాపల్లి వరకు వెళుతున్నాం''


ఆ అమ్మాయి కాలుమీద కాలేసుకుని పత్రిక తిరగేస్తోంది. అలా కూర్చోవటంలో ఆమె బంగారు రంగు పాదాలకి తెల్లని వెండి పట్టీలు మెరుస్తున్నాయి.

''అనకాపల్లి వెళ్లే వారికి బెల్లం ఉండాలి గానీ సుగరేంటా అని డౌటా'' మళ్లీ అందుకుంది వర్ధనమ్మ.

''నీయవ్వా! అవ్వ పేరే ముసలమ్మ.. సుగరన్నా మధుమేహం అన్నా ఒకటే'' మందలించాడు వర్ధనమ్మ మొగుడు వసంతరావు.

''ఓయబ్బో నాకూ వచ్చు ఇంగ్లీషు. రెండింటినీ కలిపి డయాబూటీస్ అంటారు''

ఈసారి నవ్వటం అమ్మాయి వంతైంది. కిసుక్కున నవ్వింది. ఆ నవ్వులో ఆమె అధరాలపై పుట్టుమచ్చ వికసించింది. అలాంటి పుట్టుమచ్చ వున్నవారిలో ఆకర్షణ ఎక్కువగా వుంటుంది. అందుకే ఈ పిల్ల ఇంత బావుంది- మనసులోనే అనుకున్నాడు చింత చచ్చినా పులుపు చావని వసంతరావు.



''చాయ్.. చాయ్.. ఫ్రూట్ జూస్.. మినరల్ వాటర్..'' కంపార్ట్‌మెంట్‌లో చొరబడిన అమ్మకందార్ల అరుపులు.

''మల్లెపూలూ.. తెల్లని పూలూ.. వాడని పూలూ.. మూర పది రూపాయలు మాత్రమే. లిల్లీ పూలు.. తీసుకోండమ్మా'' కిటికీలో చేతులు పెట్టి పూలవాడి అభ్యర్థన.

''ఏమండీ... ట్రైన్ కదిలిపోతుంది. పూలు తీసుకోండి'' పక్కనున్న మొగుణ్ణి గిచ్చినట్టుగా చెప్పింది వర్ధనమ్మ.

''జర్నీలో ఎందుకే? పైగా ఇది కుపే కూడా కాదు''

''చాల్లెండి సరసం. మీరు రిటైరయ్యారు గుర్తు పెట్టుకోండి'' బ్యాగ్‌లోంచి చిల్లర తీసి పూలవాడి చేతిలో పెట్టింది.

''నేను టైర్ అవలేదు. రిటైర్ మాత్రమే అయ్యాను. అదీ ప్రభువుల పనికిగానీ ఇల్లాలి పక్కకి కాదుగా''

ట్రైన్ స్పీడ్ అందుకుంది.

''సార్.. నైట్ మీల్స్ బుకింగ్.. నైట్ మీల్స్''

''ఏమేవ్.. మనకి నైట్‌కి బుక్ చేద్దామా?'' ప్రశ్నించాడు వర్ధనం మగడు.

''ఏంటా బుక్ చేసేది..

## దుర్గమహంతి మోహనరావు



## క్రేజీ కాంబినేషన్

తొలి సినిమా 'జయం' బంపర్ హిట్ తర్వాత నితిన్‌కి అంతటి హిట్ రాలేదు. మలి చిత్రం 'దిల్' పర్వాలేదనిపించుకున్నా ఆ తరువాత వచ్చిన చిత్రాలు అతని కెరీర్‌కి పెద్దగా ఉపయోగపడలేదు. తాజాగా 'ధైర్యం' కూడా ఫ్లాప్ కావడంతో నిరాశలో వున్న నితిన్‌కి ఇప్పుడు ఆశలు రేకెత్తించే అవకాశం వచ్చి పడింది. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో అవకాశం అంటే మరి మామూలు సంగతి కాదు కదా! అంతే కాదు, ఇందులో నితిన్‌కి జోడీగా లేటెస్ట్ క్రేజీ హీరోయిన్ త్రిష నటిస్తోంది. నితిన్-త్రిష జంటగా రాఘవేంద్రరావు డైరెక్షన్‌లో సినిమా అంటే చెప్పేదేముంది? సో, నితిన్ ఓ బంపర్ హిట్ కొడతాడేమో చూడాలి!

రెండి

స్తాను. చపాతీలు తిన్నగా తిని మందు బిళ్లేసుకుని పడుకోండి''

''ఏమ్మా! నువ్వు కూడా అనకాపల్లి వరకేనా? మీ ఆయన కూడా అక్కడేనా?'' సుత్తికి నాందివాచకంగా పలికింది వర్ధనమ్మ ఆ పడుచుపిల్లతో. అవునన్నట్టు తలూపింది ఆ పడుచు.

''ఏమోలేయమ్మా, ఈరోజుల్లో మొగుడో దగ్గర పెళ్లామో దగ్గర ఉద్యోగం. మా కొడుకు కోడలు అమెరికాలోనే కాని ఆమె అక్కడికి వంద మైళ్లు వెళ్లివస్తుందట. రోజూ అప్ అండ్ డౌన్. అది అమెరికా కాబట్టి సరిపోయింది. ఇక్కడి రోడ్లకైతే మరి రాత్రికి పనికిరాము'' పడుచుపిల్లని ఉద్దేశించి చెప్పటం మొదలెట్టింది వర్ధనమ్మ.

''అంతెందుకు నేను మాత్రం నైట్ డ్యూటీలు, అప్ అండ్ డౌన్లు చెయ్యలేదటే!'' వర్ధనమ్మ మొగుడు.

''చాల్లెండి. మీవన్నీ దొంగడ్యూటీలే. వయసులో వున్నప్పుడే తెలుసుకున్నాను'' మూతి తిప్పింది ఆమె. ఆవిడ తీరు నవ్వుని ఆ పడుచుపిల్ల పత్రికలో తల దూర్చింది.

''మేగ్జయిన్స్...వారపత్రికలూ.. మేగ్జయిన్స్.. సీడీలు ఘంటసాల పాటలు.. '' కంపార్టుమెంటులో అమ్మకాలు మొదలు.

''మా చిన్నప్పుడు గంట చుట్టలు, గుర్రం బీడీలు అమ్మేవారు. ఇప్పుడు సీడీలు అమ్ముతున్నారు. బాబూ ఇలా రా!'' వసంతరావు కేకేశాడు.

''బాబూ ఇంద్ర పాటలున్నాయా?'' పక్క ప్యాసింజరు అడిగాడు.

ఆమె

పేపరు కొని పై బెర్తు ఎక్కింది. అలా ఎక్కుతున్నప్పుడు ఆమె చీర కుచ్చెళ్లు మోకాలు వరకు ఎగిసాయి. పెటీకోటు కంట బడింది వసంతరావుకి.

''ఏంటయ్యా ఆ లుక్స్'' భర్తని చూపు మరల్చమన్నట్టుగా గద్దించింది వర్ధనమ్మ.

''ఆ.. ఏంలేదు. ఆ పిల్ల 'నవ్వుల లాకప్' చూస్తుంటే నీ వయసులో వున్న నవ్వులు గుర్తొచ్చాయి''

''నా నవ్వులకేం? మీలో పికప్ లేక గానీ'' సరసంగా చెప్పింది ఆమె.

ఆమె పేపరు తిరగేస్తుందనిమాటే గానీ మనసు పేపరుపై లగ్నం కావటం లేదు. ఆమె మనసు డీవీడీలో విశ్వంతో గడిపిన వైవాహిక జీవిత సీడీ మెరిసింది.

వైదేహికి విశ్వనాథంతో బెంగుళూరులో జరిగిన నేషనల్ ఫుడ్ టెక్నాలజీ కాన్ఫరెన్స్‌లో మొదటిసారిగా పరిచయం అయింది. అధునాతన మానవుడు సైన్స్ టెక్నాలజీని ఎంత ఉపయోగించుకున్నా 'కామ'పరమైన వాంఛలకోసం మసాలా దినుసులు వంటి వస్తువులనే వాడవలసి వస్తుంది. ఇలాంటి స్పైసెస్ మన భారతదేశంలో విరివిగా లభ్యం కావటం మనందరం గర్వించదగ్గ విషయం. 1642లో స్వీడన్ వృక్షశాస్త్రవేత్తలు లవంగాలకు వాంఛను ప్రేరేపించే గుణముందని కనుగొన్నారు. అలాగే ఈజిప్షియన్ గ్రంధాలు వెల్లుల్లికి కూడా అటువంటి స్పందనా శక్తి వుందని తెలుపుతాయి. వాము, ఏలకులు, అల్లం, కుంకుమపువ్వులో మనకు కావలసిన ఉత్తేజాన్ని కలిగించే గుణాలు నిక్షిప్తమైవున్నాయి. 'వయాగ్రా' వంటి మందులు పాశ్చాత్య దేశాలు వాడతాయి. కానీ మనకు ఆ అవసరం లేదు. మనం ప్రతి నిత్యం భుజించే ఆహార పదార్థాలు పచ్చడి, పులుసు, రసం వంటి వంటకాల్లో ఇటువంటి స్పైసెస్ వాడినట్టయితే వృద్ధాప్యపు ఛాయలు మన దగ్గరకి రావు'' అంటూ కొత్త తరహాలో తనదైన శైలిలో సభికుల్ని ఉత్తేజపరచి శభాష్ అనిపించుకుంది ఫుడ్ టెక్నాలజీలో గోల్డ్ మెడల్ విన్నర్ అయిన యంగ్ వైదేహి.

''హల్లో.. వైదేహిగారు.. మీ స్పీచ్ ఎక్స్‌లెంట్!'' అంటూ బెంగుళూరు రైల్వే స్టేషన్‌లో కలిసి పలకరించాడు ఓ యువకుడు.

''మీరు...''

''నా పేరు విశ్వనాథ్. ఎజి.బిఎస్‌సి. చేవెళ్ల, రంగారెడ్డి జిల్లా'' తన్ను తాను పరిచయం చేసుకున్నాడు.

''ఓ.. తెలంగాణా.. పైగా ముఖ్యమంత్రిగారి అభిమాన నియోజకవర్గం. ఐ మీన్.. వారు పాదయాత్ర, రాజీవ్ పల్లెబాట మొదలెట్టిన ప్లేస్ అన్నమాట''

''అన్నమాట కాదు, ఉన్నమాటే. మీరు కన్నడ అమ్మాయి అనుకున్నాను'' అనుమానంగా అడిగాడు.

''ఏం కన్నడా అయితే నీళ్లడుగుదామనా? ఆ! మీరు నా వెంటే వస్తున్నారా?'' వెనుతిరిగి ప్రశ్నించింది.

''మీ కంటిపాపలో నిలిచిపోలేను. మీ వెంట లోకాలు నడవలేను. కనీసం ప్లాట్‌ఫామ్ మీదైనా...''

''ఉహూ.. స్పైసెస్ గురించి వింటేనే కవిత్వం వస్తుంది. తింటే ప్రవరాఖ్యుడిలా గాలిలో తేలిపోతా రేమో. మాది విశాఖ. వెళ్తున్నది హైదరాబాదు ఈ ట్రైనులోనే'' అంటూ ప్లాట్‌ఫామ్ మీదున్న బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ చూపించింది వైదేహి. ట్రైన్ బయలుదేరడానికి చాలా టైముంది. ఇద్దరూ టీస్టాల్ దగ్గర కూర్చున్నారు.

''మీరు మీటింగ్‌లో కట్టుకున్న చీర చాలా బాగుంది మేడమ్! కానీ జరీ అంత వెడల్పుగా వుండకూడదు. చిన్నగా వుండాలి ఎందుకో తెలుసా! మీరు కాస్త పొట్టిగా వున్నారు. కానీ మీ షోల్డర్ వెడల్పుగా వుంది కాబట్టి స్క్వేర్ నెక్ బ్లౌజ్ చాలా బాగుంటుంది. ట్రాన్స్‌పరెంట్ బ్లౌజ్ వేసుకున్నప్పుడు ఇన్నర్ గార్మెంట్స్ డిజైనుకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. అది మీ అందాన్ని మరింత ద్విగుణీకృతం చేస్తుంది. మీ వాలుజడకి సైడుగా చిన్న రోజాపువ్వు పెట్టుకుంటే ఇంకా బాగుంటుంది'' ఆమెని మెచ్చుకోలుగా చెప్పేడు.

''మీరు మొక్కల గురించి బదులు గార్మెంట్ డిజైన్స్ గురించి చెబుతున్నారు. మీ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించటం లేదు'' టీ తాగుతూ అంది ఆమె.

''తాగు నీరులేక సాగునీరు లేక పచ్చిక బీళ్లు నోళ్లు విప్పి మేఘమధనం వైపు చూస్తుంటే రైతులా ఆత్మహత్య చేసుకోలేక బతుకు తెరువుకై బట్టలు కట్ చేయటం కుట్టడం నేర్చుకున్నాను. దాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ పేరున నాకు పట్టా ఇచ్చారు. పది మందికి అన్నం పెట్టే టెక్నాలజీకి రోజులు చెల్లాయి. రాజీవ్ నగర బాటలో నా బతుకు పండాలని ఆశతో ఈ వృత్తిని చేపట్టాను'' చెప్పటం ముగించాడు విశ్వం.

''మీరెంతో ఆవేదనతో వున్నట్టున్నారు. ప్రస్తుతం ఈ వక్కపొడి వేసుకోండి'' వక్కపొడి అందించింది.

''వక్కపొడిలో ఆవేదన తగ్గించే గుణం వుందాండీ''

ఆమె కిసుక్కున నవ్వింది. ఆ నవ్వుల పెదవులపై లవంగ మొగ్గలాంటి పుట్టుమచ్చ అతని కంట పడింది.

''మీ పెదవులపై లవంగ మొగ్గుంది'' విశ్వం మాట మార్చాలని ప్రయత్నించాడు.

''ఏం వక్కపొడి వద్దా? లవంగాలే కావాలా?'' మరింత చిలిపిగా ప్రశ్నించింది.

అంతలో ప్లాట్‌ఫామ్‌పై బండి కదలడానికి ఎనౌన్స్‌మెంట్ జరగడంతో ప్యాసింజర్లతో కోలాహలంగా తయారయింది.

''ఓకే. వుంటాను బై'' ఆమె విజిటింగ్ కార్డు ఇచ్చి షేక్‌హేండ్ కోసం చేయి చాపింది.

''థాంక్యూ'' అంటూ కార్డు మాత్రమే తీసుకుని చేయి కలపకుండా ఆమె సూదంటు కళ్లల్లోకి చూసాడు. ఆ సంఘటన జరిగిన పది రోజులకు విశ్వం సెల్‌ఫోన్‌లో విష్ చేసాడు. ఆ పరిచయం ప్రణయంగా మారి పరిణయానికి దారి తీసింది.

''నన్ను ముద్దుగా 'విష్' అంటే చాలు. జార్జి బుష్ భార్య కూడా మొగుణ్ణి ముద్దుగా 'బుష్షీ' అంటుందిట'' ఆమెను దగ్గరకు తీసుకుని పెదవిపై వున్న లవంగమొగ్గని అందుకున్నాడు తొలి రాత్రి విశ్వనాథ్.

''మీరు హార్డ్‌వేర్ ఇంజనీరయితే బాగుండేది'' అతని మోటుతనానికి తట్టుకోలేక అంది.

''ఏ వేర్ అయినా మనిషికి కావల్సింది నీ ఫుడ్ టెక్నాలజీ ఈ బెడ్ టెక్నాలజీయే'' ఆమెను మరింత దగ్గరగా తీసుకున్నాడు.

''పెళ్లిలో మీరు తలపాగాతో చాలా బాగున్నారు. అసలు తలపాగా ఎందుకు కడతారు'' పాల గ్లాసు ఇస్తూ అడిగింది వైదేహి.

''వైవాహిక జీవితంలో తలకు బొప్పి కడుతుందనే దానికి సూచనగా కడతారు. మన హెల్మెట్ లానే'' అతని మాటలకు ఇద్దరూ కలిసి నవ్వుకున్నారు.

''గార్మెంట్ డిజైన్స్ గురించి ఇప్పుడు చెప్పండి. మీకిష్టమైనవి కడతాను'' గోముగా అంది.

''ఈరోజు చీనీ చీనాంబరాలు కొల్లగొట్టే దినం. కట్టుకునే దినం కాదు. స్పైసెస్ తిన్న నీ మేను అందాలు రుచి చూడాలి'' ఆమె నాభిస్థానాన్ని స్పృశించాడు. పారాణి ఆరని ఆమె పాదాల అందాలను చుంబించాడు. ఆ చుంబనానికి ఆమెతోపాటు కాళ్లపట్టీల మువ్వలు కూడా పరవశించి ప్రతిధ్వనించాయి. ఆర్నెల్లు గడచిన వారి దాంపత్య జీవితంలో మూడోప్రాణి రాబోతుందని తెలుసుకుని అమితానందం పొందారు ఆ దంపతులు.

కానీ వారి ఆనందం ఎడబాటుకి దారి తీసింది. పుట్టబోయే బిడ్డకి తన తాత పేరు యాదగిరి పెట్టాలని, కాదు తన తాత పేరు సింహాద్రి పెట్టాలని ఒకరికొకరు పంతం పట్టారు. ఆ పంతాలు పట్టింపులు చిలికి చిలికి గాలివానై ఆంధ్ర-తెలంగాణా అంటూ ప్రాంతీయ తత్వానికి దారి తీసింది. ఎప్పుడో ఏర్పడే ప్రత్యేక రాష్ట్రానికి ముందే విడిపోవాలని అలిగి పుట్టింటికి బయలుదేరింది వైదేహి.

''మేడమ్ టికెట్ ప్లీజ్'' టీసీ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది వైదేహి. టికెట్ చూపించి కింద బెర్తులో కూచుంది. వర్ధనమ్మ, వసంతరావు పల్లీలు తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

''ఏంటమ్మా నిద్రపట్టేసిందా? ఎందుకలా వున్నావు అప్పటి నుంచీ చూస్తున్నాను. మీ ఆయనతో ఏదైనా గొడవా, కాస్త టీ తాగు'' అంటూ వర్ధనమ్మ టీ ఇప్పించి భేటీ వేసింది.

ఆమె ఆత్మీయతకి లొంగిపోయింది వైదేహి. కళ్లనీళ్లతో కథంతా చెప్పేసింది.

''ఈమాత్రం దానికే విడిపోవాలా? నా చిన్నప్పటి నుంచి చూస్తున్నాను, ఈ ప్రత్యేక తెలంగాణా గొడవ. మనమంతా భారతీయులం. తరువాతే తెలుగువాళ్లం. భాషాపరంగా ఏర్పడిన తొలిరాష్ట్రం మనది. అయినా, అంతర్ ఖండాల వాళ్లే పెళ్లిళ్లు చేసుకుని మన దేశంలో స్థిరపడిపోయి పదవుల కోసం పాకులాడుతున్న ఈ తరుణంలో మన తెలుగువాళ్లం విడిపోవడంలో అర్థం లేదు. అందునా మొగుడు పెళ్లాల మధ్య ప్రాంతీయ భేదాలు అసలుండవద్దు. నాదేమో అనకాపల్లి, ఆయనదేమో అనంతపురం. కలిసి సంసారం చెయ్యటం లేదూ? అదిగో విజయవాడ వచ్చేస్తుంది. బుద్ధిగా దిగి మీ ఇంటికి పో. మీ ఆయన సెల్ నెంబరు చెప్పు'' అంటూ నెంబరు తీసుకుని ఆమె సెల్ తీసుకుని ఫోన్ కొట్టింది పాత సినిమాలో మంచి సూర్యకాంతంలా వర్ధనమ్మ.

వైదేహికి ఏం చేయాలో అర్థంకాక అనాలోచితంగా నెంబరిచ్చి బిత్తరపోయి చూడసాగింది. విజయవాడలో ట్రైన్ ఆగిన వెంటనే కంపార్ట్‌మెంట్ ఎదురుగా విశ్వనాథ్. నమ్మలేకపోయింది వైదేహి.

''విష్షూ'' అంటూ అతని చేతులు రెండు పట్టుకుని తన ముఖం దాచుకుంది.

''ఉష్.. అంత సీనొద్దు! నీకోసమే నీ వెంటే జనరల్ బోగీలో ఎక్కేను. పద ఈ రాత్రికి విజయవాడలో బస చేద్దాం. థాంక్యూ అంకుల్, థాంక్యూ ఆంటీ'' బై చెప్పి ఆమెతో బయటకు నడిచాడు విశ్వనాథ్.

వర్ధనమ్మని వసంతరావుని వైదేహి కోసమే 'తత్కాల్ కోటా'లో విశ్వనాథ్ రైలెక్కించిన విషయం ఆమెకు తెలీదు. ☆

